క్లుప్తంగా

రెండో రోజూ కొనసాగిన ఇంటి పన్నుల సర్వే

పెడన: పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి చేపట్టిన సర్వే గురువారంతో రెండో రోజుకు చేరింది. మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య సర్వేకు ప్రత్యేకంగా కార్యాలయంలోని కొందరు సిబ్బందిని నోడల్ అధికారులుగా నియమించి సచివాలయ ఉద్యోగులు సక్రమంగా చేస్తున్నదీ లేనిది పరిశీలించి నివేదిక ఇవ్వాలని పేర్కొన్నప్పటికీ నోడల్ అధికారులు పూర్తిస్థాయిలో స్పందించకపోవడంపై గురువారం ఆయన మండిపడ్డారు. నోడల్ అధికారులు రాకపోతే తన దృష్టికి తీసుకురావాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. దీంతో రెండో రోజు నోడల్ అధికారులుగా నియమితులైన కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది సచివాలయ ఉద్యోగులతో కలిసి కొన్ని చోట్ల సర్వేలో పాలుపంచుకున్నారు. రెండు అంతస్తుల భవనాలకు సంబంధించి కింద ఫ్లోర్‌కు మాత్రమే పన్ను వేసి పై ఫ్లోర్‌లకు పన్ను వేయని వాటిని గుర్తించారు. అసలు పన్నులు వేయని వాటితో పాటు అరకొరగా వేసిన పన్నుల వాటి వివరాలను పూర్తిగా నమోదు చేసుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ఏఎంసీ మాజీ డైరెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మాజీ ఏఎంసీ డైరెక్టర్ బాణావతు బాలును మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య వివరాలు, చికిత్స గురించి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషాతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సినీ నటుడు కైకాల జయంతి వేడుకలు

మోపిదేవి: సినీ నటుడు కైకాల సత్యనారాయణ 89వ జయంతి వేడుకలు మోపిదేవిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సినీ నటుడిగా, మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడిగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. కోసూరు నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోసూరు రామాంజనేయులు, ఉప్పాల బసవయ్య, బోగిరెడ్డి సాంబయ్య పాల్గొన్నారు.

ఎంపీడీవో రమణారావు మృతికి సంతాపం



పెడన: నరసాపురం ఎంపీడీవో వెంకట రమణారావు మృతి చాలా బాధాకరమని పెడన ఎంపీడీవో వి.రెడ్డయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో రమణారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జయరాం, కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామాలకు చెందిన గ్రామ సచివాలయాల సిబ్బంది, కార్యదర్శులు, ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోసగించిన కూటమి ప్రభుత్వం

జైభీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్

అవనిగడ్డ: ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయమని డిమాండ్ చేయకుండా అమరావతి రాజధానికి రూ.15వేల కోట్లు అప్పు తీసుకోవడం ద్వారా కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని జైభీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం టాక్స్ ఇన్సెంట్ ఇవ్వాల్సి ఉన్నా దాని గురించి కూటమి ప్రభుత్వం మాట్లాడక పోవడం ఏమిటని ప్రశ్నించారు. కడప స్టీల్ ప్లాంట్, విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోయినా పెదవి విప్పలేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు గొరుముచ్చు రవి పాల్గొన్నారు.

కృష్ణమ్మకు పంచహారతులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్‌లో గురువారం సాయంత్రం కృష్ణమ్మకు పంచహారతుల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత దుర్గాఘాట్‌కు చేరుకున్న దుర్గ గుడి కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామరావు కృష్ణమ్మకు పూజలు చేసి పసుపు, కుంకుమ, చీరను సమర్పించారు. అనంతరం ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పంచహారతులు ఇవ్వగా, హారతులను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు స్నానఘాట్‌కు చేరుకున్నారు.

ఎత్తిపోతల పథకం ముందుకు సాగేనా?



ఎత్తిపోతల ద్వారా వచ్చే నీరు కృత్తివెన్ను ప్రధాన పంటకాలువలో కలిసే ప్రదేశం



రెండవ పంటకు నీరివ్వకపోవడంతో బీడువారిపోతున్న పంటచేలు (ఫైల్)

- ఏళ్లు గడుస్తున్నా చలనం లేని మాట్లాం ఎత్తిపోతల పథకం
- పదివేల ఎకరాలకు సాగునీరందించే అవకాశం
- పూర్తయితే తీర ప్రాంతంలో రెండవ పంటకు ఢోకా ఉండదు

కృత్తివెన్ను: ఆనాడు పెడన ఎమ్మెల్యేగా ఉన్న కాగిత వెంకట్రావు సంకల్పించిన ఎత్తిపోతల పథకం నిర్మాణం తీరప్రాంత రైతులకు ఎనిమిదేళ్లుగా కలగానే మిగిలిపోయింది. ఇప్పుడు ఆయన తనయుడు కాగిత కృష్ణప్రసాద్ పెడన ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తన తండ్రి సంకల్పాన్ని నెరవేర్చి ఈ ప్రాంత రైతుల ఎత్తిపోతల నిర్మాణం కలను నెరవేర్చుతాడా అన్న ఆశ రైతుల్లో బలంగా కనిపిస్తుంది. తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలంలోని రైతుల సాగునీటి కష్టాలు తీరాలంటే మాట్లాం గ్రామం సమీపంలో తలపెట్టిన ఎత్తిపోతల పథకం పూర్తిచేయాల్సి ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నా ఈ పథకం ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయింది. ప్రతి ఏడాది సాగునీటి కొరత కారణంగా శివారు గ్రామాల రైతుల పంట చేలకు నీర ందక పంటలు ఎండిపోవడంతో ఇక్కడి రైతులు తీవ్రమైన ఆర్థిక నష్టాలు ఎదుర్కొనేవారు. ఇటీవల చాలా ఏళ్లగా ఈ ప్రాంతంలో రెండవ పంట కనుమరుగైపోయింది. దీంతో పచ్చని పంటచేలు బీడు వారిపోతున్నాయి. గతంలో పెడన శాసనసభ్యుడు కాగిత వెంకట్రావు 2016 ఫిబ్రవరిలో ఇరిగేషన్, డ్రైనేజ్ అధికారులతో సంప్రతించి మాట్లాం సమీపంలో ఉప్పుటేరుపై కొల్లేరు మిగులు జలాలను పైపులైను ద్వారా తరలించి గరిశపూడి వద్ద గల అండర్‌టన్నెల్ వంతెన వద్ద కృత్తివెన్ను ప్రధాన పంటకాలువలో అనుసంధానం చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రతిపాదన ప్రకారం యుద్ధ ప్రాతిపదికన పైపులైను నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని, రైతుల నుంచి ఆమోదపత్రం, సంబంధిత వివరాలతో కూడిన అన్ని పత్రాలను అప్పట్లోనే అధికారులకు అందించారు. ఆరునెలల్లోనే అనుకున్న పని కార్యరూపం దాల్చుతుందని, రైతుల సాగునీటి కష్టాలు తీరిపోతాయంటూ నాయకులతో పాటు అధికారులు అనుకున్నారు. కానీ ప్రాజెక్టు పనులు జరగలేదు. తరువాత కాలంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన జోగి రమేష్ అధికార యంత్రాంగంతో పాటు కైకలూరు, ఉండి ఎమ్మెల్యేలతో కలసి ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే ఆ తర్వాత నిధుల లేమి కారణంగా ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అయినా ఈ ఎత్తిపోతల పథకంపై శ్రద్ధ చూపాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిష్టాత్మక ప్రాజెక్టు...

మాట్లాం సమీపంలో ఉప్పుటేరు వద్ద 2016లో రూ.27.44 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అంచనాలు తయారుచేశారు. దీని వల్ల మండలంలోని 9911.09 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందనుంది. ఎత్తిపోతల పథకం నుంచి రెండు మోటార్ల ద్వారా 104.508 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. పథకం వద్ద నుంచి 3.3 కిలోమీటర్ల పొడవునా పెదలంక డ్రైన్ గట్టు వెంబడి సీసీ పైపులైన్ ద్వారా గరిశపూడి అండర్ టన్నెల్ వద్ద కృత్తివెన్ను ప్రధాన పంట కాలువలో నీటిని అనుసంధానిస్తారు. దీని వల్ల సుమారు 8 వేల మంది రైతులకు సాగునీటి కష్టాలు తీరుతాయి. ఇంతటి ఉపయోగకరమైన ప్రాజెక్టును తక్షణం నిర్మించాలని తీర ప్రాంత రైతులు కోరుతున్నారు.

ఘంటసాలలో ఆషాఢ సారె ఉత్సవం



ఘంటసాలలో అమ్మవారికి ఆషాఢ సారె తీసుకెళ్తున్న ఆర్యవైశ్య మహిళలు, గ్రామస్తులు

ఘంటసాల: ఘంటసాల గ్రామంలో మొట్టమొదటిసారిగా గురువారం ఘంటసాల శ్రీబాల పార్వతీ సమేత జలధీశ్వర స్వామి గ్రూపు సభ్యులు, వాసవీ క్లబ్, గ్రామస్తుల సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవార్లకు ఆషాఢ సారె ఉత్సవం నిర్వహించారు. గ్రూపు ప్రతినిధులు గెల్లి వెంకట సత్య కుమారి, సంకా ఉష, చుండూరి ప్రభావతి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు, గ్రామస్తులు, వాసవీ క్లబ్ మహిళలు వివిధ రకాల పండ్లు, పూలు, స్వీట్లు, నూతన వస్త్రాలు, గాజులు, ఇతర ఆహార పదార్థాలతో ఘంటసాల సెంటర్ నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి గ్రామోత్సవం నిర్వహిస్తూ బ్యాంకు సెంటర్లోని గ్రామదేవత పెన్నేరమ్మ అమ్మ వారికి ముందుగా ఆషాఢ సారె సమర్పించారు. అక్కడ నుంచి గ్రామోత్సవంగా బయలుదేరి శ్రీబాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి దేవస్థానం చేరుకుని అమ్మ వారికి ఆషాఢ మాసం సారె సమర్పించగా అర్చకులు చావలి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ

గూడూరు: పవిత్ర ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మాధవస్వామి ఆలయంలో భక్తులు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. పురోహితులు గంజాం మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు శ్రీఅన్నపూర్ణాదేవికి సారె వేడుక

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆషాఢపు సారె వేడుక నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు గురువారం తెలిపారు. ఆలయంలో విగ్రహ దాత అర్జా ఉదయభాస్కర్ దంపతుల ఆధ్వర్యంలో ఈ అమ్మవారి సారె వేడుక జరుగుతుందన్నారు. సంప్రదాయ రీతిలో జరిగే ఆషాఢ సారె పూజల్లో గ్రామంలోని మహిళలు పాల్గొని అన్నపూర్ణాదేవికి భక్తిశ్రద్ధలతో సారె సమర్పిస్తారని పేర్కొన్నారు.

అంకమ్మ తల్లికి...

నాగాయితిప్ప(మోపిదేవి):మండలంలోని నాగాయితిప్ప గ్రామంలో ఉన్న శ్రీ అంకమ్మ తల్లికి ఆషాఢ సారె సమర్పించారు. గరికిపాటి వారి ఇలవేల్పుగా కొలవబడుతున్న అంకమ్మ తల్లికి గురువారం ఉదయం మహిళలంతా సామూహికంగా పట్టు చీర, పసుపు, కుంకుమ, పండ్లు, పూలతో పాటు పలురకాల పిండి వంటకాలతో గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి సారెను అమ్మవారికి సమర్పించుకున్నారు. బంధుమిత్రులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరదణం నెలకొంది. యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



అమ్మవారికి ఆషాఢం సారె సమర్పిస్తున్న భక్తులు



నాగాయితిప్పలో అంకమ్మ తల్లికి సమర్పించిన ఆషాఢ సారె

రోడ్ల వెంట కలుపు మొక్కల నిర్మూలన



నాగాయలంకలో రోడ్లకు ఇరువైపులా కలుపు నిర్మూలన మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

నాగాయలంక: పరిసరాల పరిశుభ్రతలో భాగంగా వర్షాల కారణంగా బుధవారం నాగాయలంకలో రోడ్లకు ఇరువైపులా విపరీతంగా పెరిగిన కలుపు మొక్కలు (పిచ్చి మొక్కలు, గడ్డి) నిర్మూలన చర్యలను గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. కలుపు కారణంగా వాటిలో పాములు, పురుగుల సంచారం పెరిగిందని గ్రామస్తులు ఫిర్యాదులు చేయడంతో రోడ్లుకు ఇరువైపులా కలుపు మొక్కల నిర్మూలనకు చర్యలు ఆరంభించినట్లు గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్ చెప్పారు. పంచాయతీలోని సుమారు 60–70 అంతర్గత రహదారులకు ఇరువైపులా పంచాయతీ సిబ్బందితో కలుపు నివారణ మందు గ్రేసెల్‌ను పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. నాలుగైదు రోజులు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన వివరించారు. పంచాయతీ పాలక వర్గ సభ్యులు, గ్రామస్తుల సూచనల ప్రకారం సర్పంచ్ కైతేపల్లి అంకాలు, ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు పర్యవేక్షణలో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది కలుపు నిర్మూలన మందును పిచికారీ చేస్తున్నారు.

వాహనచోదకులు నిబంధనలు పాటించాలి



కోడూరు: వాహనచోదకులు తమ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శిరీష స్పష్టం చేశారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో గురువారం ఆమె వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో ఆటోడ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్‌ఐ సూచించారు. అనంతరం వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సాంస్కృతిక దినోత్సవం

కృత్తివెన్ను: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శిక్షాసప్తాహ్‌లో భాగంగా గురువారం సాంస్కృతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్టు ఎంఈవో–2 ప్రసాదరావు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. నీలిపూడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన మురళీ కోలాట ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ఎంఈవో బాలత్రిపురసుందరి, హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు శంకరరావు, లావణ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆపద ప్రబంధన్ పురస్కార్‌కు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): విపత్తు నిర్వహణ రంగంలో వ్యక్తులు లేదా సంస్థలు చేసిన అద్భుతమైన పనిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్ పేరుతో అవార్డును అందజేయనుందని, దీనికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ గురువారం తెలిపారు. ఈ అవార్డులను ప్రతి సంవత్సరం జనవరి 23వ తేదీ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా ప్రకటిస్తారని, సంస్థకు రూ.51 లక్షలు, వ్యక్తికి రూ.5 లక్షల నగదు పురస్కారాలు అందజేస్తారన్నారు. 2025వ సంవత్సరానికి ఈ పురస్కారం కోసం ఆగస్టు 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

జాబ్‌మేళాకు 229 మంది హాజరు



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు తదితరులు

పెడన: పట్టణంలోని శ్రీ విజయానంద డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన జాబ్ మేళాకు 229 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నాగమల్లేశ్వరరావు అన్నారు. ప్రతి ఏడాది మూడు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది మొదటి మేళాకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరవగా, వీరిలో 111 మంది 9 కంపెనీలకు ఎంపికైనట్లు వివరించారు. ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమో, బీటెక్ చదివిన అభ్యర్థులు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఇండిగో ఎయిర్‌లైన్స్, ఐసీఐసీ బ్యాంక్, అరవిందో ఫార్మా, రాక్ మ్యాన్, ఇసుజ మోటార్స్, హుండాయ్, మొబైల్స్, అపోలో ఫార్మసీ, స్పందన, ఎస్‌వీవీసీ రెడ్ శాండిల్ ఫార్మింగ్ మార్కెటింగ్ ఎగ్రిక్యూటివ్స్‌కు ఎంపికలు జరిగాయన్నారు. ఈ కంపెనీలలో డెక్సాన్ కంపెనీకి అత్యధికంగా 51 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కె.జ్యోతిరాజు, డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వుమ్మిటి విద్యాధర్, కే సొల్యూషన్స్ అధినేత కె.అరవింద్ కృష్ణ, పవన్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో మహిళాభివృద్ధికి పెద్దపీట

మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళాభివృద్ధికి పెద్దపీట వేశారని బీజేపీ జిల్లా మహిళామోర్చ అధ్యక్షురాలు దోవారీ ధనలక్ష్మి అన్నారు. ఆమె గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో మహిళలు, బాలికల సంక్షేమానికి దాదాపు రూ.3 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించారన్నారు. ఈ నిధులతో దేశవ్యాప్తంగా మహిళలు, బాలికల అభివృద్ధికి బాటలు పడతాయన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ మహిళల పట్ల ఉన్న గౌరవంతో వారి అభివృద్ధికి నిధులను కేటాయించటం అభినందనీయమన్నారు. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలిపారు. సమావేశంలో బీజేపీ మహిళా మోర్చ జిల్లా నాయకురాలు తలాటం పద్మావతి ఉన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): మాదకద్రవ్యాలు విక్రయించకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక నోబుల్ కళాశాలలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ మాదకద్రవ్యాల సరఫరా, మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా మంచి విద్యాబుద్ధులు అలవర్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. సదస్సులో నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జే ఎర్నెస్ట్, సీనియర్ న్యాయవాది రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కేవీకేను సందర్శించిన బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ఘంటసాల: విద్యార్థుల విద్యా ప్రణాళికలో భాగంగా గురువారం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించినట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలత కృష్ణా జిల్లాలో వివిధ పంటల సాగు, చేపట్టిన శిక్షణ కార్యక్రమాలు, క్షేత్ర స్థాయి సందర్శనలు, అవగాహన కార్యక్రమాలు, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, పోషకాహారంలో భాగంగా చిరు ధాన్యాల ప్రాముఖ్యం, ఇతర అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం కేవీకేలోని వివిధ అంశాల పై కేవీకే శాస్త్రవేత్తలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ మంజువాణి, యశ్వంత్ కుమార్, డాక్టర్ రేవతి, కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

● రేపటి నుంచి బిజినెస్ ఎక్స్‌పో

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బెజవాడ బిజినెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యాన ఈ నెల 26, 27, 28 తేదీల్లో సత్యనారాయణపురంలోని నాడార్స్ ఫంక్షన్ హాలులో బెజవాడ బిజినెస్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి గంగరాజు సూర్యకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో వస్త్రాలు, పిండివంటలు, పచ్చళ్లు, మొబైల్ పరికరాలు, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీస్, పూజ సామాగ్రి, నార వస్తువులు, హెర్బల్ ఉత్పత్తులు, గృహోపకరణాల ప్రదర్శనలు, అమ్మకాలు జరుగుతాయని వివరించారు.

హైవేపై అలముకున్న అంధకారం

- రెండు నెలలుగా వెలగని విద్యుత్ దీపాలు
- ప్రమాదభరితంగా ప్రయాణాలు



గాంధీనగరంలో హైవే విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో కమ్ముకున్న చిమ్మచీకటి

కృత్తివెన్ను: గ్రామాలున్న చోట హైవేపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు అలంకారప్రాయంగా మారాయి. కృత్తివెన్ను మండలంలోని గాంధీనగరం గ్రామం మీదుగా 216ఏ జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. రాత్రి సమయంలో గ్రామస్తులు హైవేపై సంచరించే సమయంలో ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకూడదనే ఉద్దేశంతో హైవే అధికారులు 22 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. పేరుకే లైట్లు పెట్టారుగానీ అవి వెలగడం లేదని, ఈ కారణంగా తరచూ తమ గ్రామంలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సుమారు రెండు నెలల నుంచి లైట్లు వెలగడం లేదని దీని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని ఎవరికి తెలియజేయాలో కూడా తమకు తెలియదని గ్రామస్తులంటున్నారు. విద్యుత్ దీపాలు వెలిగేలా హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సీసీఆర్సీ కార్డులతో ఇబ్బందులు ఉండవు

ఏవో మురళీకృష్ణ



కొత్తపల్లిలో సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేస్తున్న ఏవో మురళీ కృష్ణ, వీఆర్వో, ఈవోలు

కొత్తపల్లి(ఘంటసాల): సీసీఆర్సీ కార్డుల వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ అన్నారు. ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామంలో పంట సాగుదారు హక్కు పత్రాలు అంశంపై కౌలు రైతులతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, పంట రుణాలు, వడ్డీ లేని రుణాలు, ఈ–క్రాప్ బుకింగ్, మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడానికి, ప్రకృతి వైపరీత్యాలకు వచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలను పొందడానికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డు ఉపయోగపడుతుందన్నారు. సీసీఆర్సీ కార్డులు కావాల్సిన కౌలు రైతులు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌తో అర్జీని వీఆర్వో లేదా వీఏఏలకు అందించాలన్నారు. ఘంటసాల మండలంలో ఇప్పటివరకు 1040 సీసీఆర్సీ కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. సీసీఆర్సీ కార్డుల వల్ల భూ యజమాని హక్కులకు ఎటువంటి భంగం వాటిల్లకుండా కేవలం 11 నెలల కాలపరిమితి వరకే పని చేస్తుందని ఏవో మురళీ కృష్ణ చెప్పారు. అనంతరం కౌలు రైతులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో పి.నాగమల్లేశ్వరి, వీఏఏ యూసఫ్ అలీ, ఈవో కె.లక్ష్మీ సునంద, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఆకతాయి

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుకవైపున ఉన్న బాలికల వసతి గృహం వద్ద ఓ ఆకతాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వసతి గృహం వద్ద గురువారం యువకుడి ఆకతాయి చేష్టలను గమనించిన వసతి గృహానికి వచ్చిన కొంతమంది తల్లిదండ్రులు అతనిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

కూటమి నాయకుల కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న కూటమి నాయకులు

మచిలీపట్నంటౌన్: కార్గిల్ యుద్ధ విజయం సాధించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ యువమోర్చ ఆధ్వర్యంలో గురువారం నగరంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కోనేరు సెంటరు నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారిలో సాగింది. బీజేపీ యువమోర్చ నాయకులు, కార్యకర్తలతో పాటు కూటమి నాయకులు కాగడాలను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు జాతీయజెండాలను చేబూని ముందుకు సాగారు. కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. ర్యాలీలో యువజన మోర్చ జిల్లా అధ్యక్షుడు నాగలింగం అయోధ్య రామచంద్రరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, టీడీపీ నగర అధ్యక్షుడు ఇలియాస్ పాషా, బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ గాంధీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంతం గజేంద్ర, జనసేన నాయకుడు గడ్డం రాజు, బీజేవైఎం నాయకులు పత్తిపాటి రమణ, యిర్రింకి నాగశ్రీనివాస్, ఘంటా సతీష్‌కుమార్, వీరమల్లు పాల్గొన్నారు.